క్లుప్తంగా

ఆలయ రహదారి పనులు ముమ్మరం



శ్రీ నిత్యపూజ స్వామి కోన రహదారి పనులు చేస్తున్న కూలీలు

సిద్దవటం : మహా శివరాత్రి ఉత్సవాల్లో భాగంగా గురువారం నుంచి శ్రీ నిత్యపూజ స్వామి ఆలయానికి వెళ్లే రహదారి పనులను ఆర్అండ్‌బీ అధికారులు చేయిస్తున్నారు. శ్రీ నిత్యపూజ స్వామి ఆలయంలో ఫిబ్రవరి 25 నుంచి మూడురోజుల పాటు ఉత్సవాలు జరుగనున్నాయి. ఆవుల ఆశ్రమం వద్ద నుంచి పంచలింగాల వరకు రహదారి పనులు చేపడుతున్నారు. వాహనదారులు, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా గుంతలను పూడ్చి చదును చేయిస్తున్నారు. పంచలింగాల వద్ద తాత్కాలిక మరుగు దొడ్లు, టాయిలెట్స్ గదుల నిర్మాణాలను చేస్తున్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు శ్రీ నిత్యపూజ స్వామి కోనకు వెళ్లే రహదారి పనులు చేపడుతున్నామని ఆర్ అండ్ బి ఏఈ గంగిరెడ్డి తెలిపారు.

బీసీల సంక్షేమానికి కృషి

రాయచోటి టౌన్ : బీసీల సంక్షేమానికి కృషి చేస్తానని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అన్నమయ్య జిల్లా మహిళ అధ్యక్షురాలు పద్మ యాదవ్ అన్నారు. జాతీయ బీసీ సంక్షేమ సంఘంలో నూతన నియామకాలు చేపట్టారు. జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా వెంకట రమణ యాదవ్, జిల్లా వైస్ ప్రెసిడెంట్‌గా నాగేశ్వర, జిల్లా ప్రధాన కార్యదర్శిగా నాగేంద్ర బాబు, జిల్లా సెక్రటరీగా మల్లిఖార్జున, జిల్లా మహిళ సెక్రటరీగా లక్ష్మీకళ, రాయచోటి సబ్ డివిజన్ ప్రెసిడెంట్‌గా నాగరాజ, జనరల్ సెక్రటరీగా జయరాం, వైస్ ప్రెసిడెంట్‌గా రమణలతో పాటు తాలూక కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. వీరికి గురువారం పద్మ యాదవ్ నియామక పత్రాలు అందజేశారు.

చెత్త వేస్తే రూ. వెయ్యి జరిమానా

గాలివీడు : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల వద్ద గురువారం హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేసినట్లు పంచాయతీ కార్యదర్శులు ఆంజనేయులు నాయక్, శివా నాయక్ తెలిపారు. పాఠశాల చుట్టుపక్కల నివాసం ఉండేవారు, దుకాణదారులు చెత్తా చెదారం, వ్యర్థాలను పాఠశాల ఎదుట వేయడంతో దుర్గంధంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో అక్కడ చెత్తాచెదారం వేస్తే రూ.1,000 జరిమానా విధిస్తామని పంచాయతీ అధికారులు హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేశారు. ఇప్పటికే అనేకమార్లు హెచ్చరించినప్పటికీ ఫలితం లేకపోవడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు వారు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు నిజాముద్దీన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అడవికి ఆకతాయిల నిప్పు

రామాపురం : పాలకొండలు ఆకతాయిల చేష్టలకు దహించుకుపోతున్నాయి. మండలంలోని జాతీయ రహదారిలోని గువ్వలచెరువు ఘాట్ రోడ్డు నుంచి వీరబల్లి మండలం వరకు ఈ పాలకొండలు ఆవరించి ఉన్నాయి. నిత్యం ఈ ప్రాంతాల్లో ఏదో ఒక చోట అడవికి నిప్పు పెడుతున్నారు. దీనివల్ల విలువైన అటవీ సంపద దహించుకుపోతోంది. ఒక వైపు కరువు పరిస్థితులలో పశువులకు పచ్చగడ్డి, పశుగ్రాసం కొరవడింది. అడవులకు పశువులకు తరలించి అక్కడ మేతతో యజమానులు పశుపోషణ సాగిస్తున్నారు. దీంతో పాటు వెదురు, ఎర్రచందనం, తేనె, సారపప్పు, కొండమామిడి, అడవి చింతపండు, బోద మానవాళికి ఎంతో ఉపయోగపడుతున్నాయి. ఈ పరిస్థితులలో అడవికి నిప్పుపెట్టడం వల్ల విలువైన వస్తువులు సంపద కాలిపోతోంది. వరుస ఘటనలు జరుగుతున్నా అటవీ అధికారులు చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి.

రుణగ్రస్తులెందరో..!



మున్సిపల్ కార్యాలయంలో ఇంటర్వ్యూలకు పెద్ద ఎత్తున హాజరైన అభ్యర్థులు

రాయచోటి అర్బన్ : బీసీ కార్పొరేషన్ ద్వారా సబ్సిడీ రుణాలు అందించేందుకు గురువారం మున్సిపల్ కార్యాలయంలో చేపట్టిన ఇంటర్వ్యూలకు అభ్యర్థులు ఎగబడ్డారు.అధికారుల్లో ముందుచూపు కొరవడటంతో దరఖాస్తుదారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. రుణాల మంజూరుకు పట్టణ పరిధిలోని 1,458 మంది ఆన్‌లైన్ అప్లికేషన్ చేసుకున్నారు. వీరిలో 1,242 మంది గురువారం మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. 370 యూనిట్లకు లబ్ధిదారుల ఎంపికకు గాను పట్టణ పరిధి లోని 17 బ్యాంకుల మేనేజర్లు, ఉద్యోగులు హాజరై ఇంటర్వ్యూలను నిర్వహించినట్లు కమిషనర్ వాసుబాబు తెలిపారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం

నందలూరు : మండలంలోని నల్ల తిమ్మయ్యగారిపల్లి గ్రామంలో ఎస్ఐ వెంకటేశ్వర్లు గురువారం తన సిబ్బందితో దాడులు నిర్వహించి 18 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకొని ఓ వ్యక్తిని అరెస్టు చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ అక్రమంగా మద్యం కలిగిన పల్లె నరసింహారెడ్డి అనే వ్యక్తిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

చెత్త బోలెడు.. దిగుబడి చారెడు

- ఉసూరుమనిపించిన ఉలవ పంట
- అరకొర దిగుబడి
- ఆదుకోని ప్రత్యామ్నాయ పంట
- ధరలేక రైతన్నలు ఆందోళన



నూర్పిళ్ల కోసం కుప్పగా పోసిన ఉలవ పంట

రామాపురం : మండలవ్యాప్తంగా ప్రత్యామ్నాయ పంటగా ఉలం పంటను ఎక్కువ విస్తీర్ణంలో సాగు చేశారు. అధిక వర్షాల వల్ల పంట ఏపుగా పెరిగినా.. దిగుబడి మాత్రం రాలేదు. ఏటా ఖరీఫ్‌లో వేరుశనగ సాగుచేసినా.. రెండేళ్లుగా అతివృష్టి, అనావృష్టితో వరుస నష్టాలను రైతులు చవి చూశారు. కనీసం పెట్టుబడులు కూడా దక్కకపోవడంతో పంటలు సాగుచేయడానికి జంకుతున్నారు. ఈ ఏడాది ఉలవ పంట ఏపుగా పెరిగింది. వర్షం రావడంతో కాయలో గింజపట్టడంలేదు. కోత సయమానికి కూలీ రేట్లు విపరీతంగా పెరిగాయి. వాతావరణ పరిస్థితుల కారణంగా పంట దిగుబడి కూడా అంతంత మాత్రమే వచ్చింది. గత రెండేళ్లుగా ధర కూడా బాగా ఉండటంతో ఈ ఏడాది అధికంగా సాగు చేశారు. వాతావరణంలో మార్పు, పొగ మంచు కారణంగా దిగుబడి గణనీయంగా తగ్గింది. సెప్టెంబర్, అక్టోబర్ సాగు చేసిన రైతులకు వేర్వేరుగా దిగుబడి వచ్చింది. కిలో రూ.30 నుంచి రూ.35 పలుకుతోంది. ఎకరం పంట సాగుకు సుమారు రూ.10 నుంచి రూ.15 వేల వరకు ఖర్చు వస్తుంది.

పెరిగిన కూలీ రేట్లు

నూర్పిళ్లకు పెద్దగా ఖర్చు పెట్టాల్సిన అవసరం లేదు. అయితే పంట కోత సమయంలో కూలీ రేట్లు విపరీతంగా పెరిగాయి. అసలే అంతంత దిగుబడి వచ్చి రైతులు ఆందోళనలో ఉంటే నూర్పిళ్ల సమయంలో కూలీ పెరగడంతో గోరు చుట్టుపై రోకలి పోటు అన్న చందంగా రైతుల పరిస్థితి మారింది. అన్నీ అనుకూలిస్తే హెక్టారుకు 3 నుంచి 4 క్వింటాళ్లు దిగుబడి వస్తోంది. ఈ సారి దిగుబడి బాగా తగ్గింది. అరకొరగా వచ్చిన దిగుబడికి గిట్టుబాటు ధర కూడా లేకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

ఆశించినంత దిగుబడి రాలేదు

ఈ ఏడాది ఉలవపంట సాగు చేశాను. ఆశించిన స్థాయిలో దిగుబడి రాలేదు. నూర్పిళ్ల సమయంలో కూలీ రేట్లు కూడా పెరిగాయి. వాతావరణంలో మార్పు వలన పెట్టుబడి ఖర్చులు కూడా రాలేదు. దీంతో చాలా నష్టపోవాల్సి వచ్చింది.

- బాలకృష్ణ, రైతు, కుమ్మరపల్లె, రామాపురం మండలం

నిరాశే మిగిలింది

హెక్టారుకుపైగా ఉలవపంట సాగు చేశారు. సుమారు రూ. 25వేలు ఖర్చు అయింది. పెట్టుబడి కూడా రాలేదు. కూరగాయల సాగుతో గతేడాది లక్ష రూపాయలు వరకు పొందాన. ఈ ఏడాది ఉలవ సాగు చేసి నష్టపోయాను.

-రామచంద్ర, రైతు, రామాపురం

అమరావతిని ఫ్రీజోన్‌గా ప్రకటించాలి



మాట్లాడుతున్న జక్కుల వెంకటేష్

రాయచోటి అర్బన్ : రాష్ట్ర రాజధాని అమరావతిని ఫ్రీజోన్‌గా ప్రకటించి రాష్ట్రంలోని 26 జిల్లాల నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలను కల్పించాలని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జక్కుల వెంకటేష్, రాజశేఖర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ డీఎస్సీ నోటిఫికేషన్ ద్వారా ఉపాధ్యాయులతో పాటు ఏపీపీఎస్సీ ద్వారా గ్రూప్ 1,3 ఉద్యోగాలను భర్తీ చేయాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో యువతీయువకులకు క్రీడాపోటీలు నిర్వహించి నైపుణ్యం కలిగిన యువతకు శిక్షణ ఇవ్వాలని, స్వయం ఉపాధికి వడ్డీలేని రుణాలను మంజూరు చేయాలని కోరారు. వెనుకబడిన రాయలసీమ, ఉత్తరాంధ్ర, ప్రకాశం జిల్లాల్లో నూతన పరిశ్రమలు ఏర్పాటు చేసి స్థానిక యువతకు ఉపాధి అవకాశాలను కల్పించాలన్నారు. కడప ఉక్కు కార్మాగారం నిర్మాణానికి నిధులు కేటాయించి పనులు త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు.

మార్చి 2న బోల మల్లేశ్వరస్వామి కల్యాణం

నందలూరు : మండలంలోని చింతకాయలపల్లి గ్రామంలోని మల్లేశ్వరస్వామి దేవాలయంలో శ్రీ కామాక్షి సమేత బోల మల్లేశ్వరస్వామి కల్యాణం అంత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త చింతకాయల గంగినాయుడు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్చి 2వ తేదీ ఆదివారం ఉదయం అభిషేకాలు, పూజా కార్యక్రమాలు అనంతరం 10 గంటలకు స్వామివారి కల్యాణోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాజ్యసభ సభ్యులు మేడా రఘునాథరెడ్డి, ఎమ్మెల్యే ఆకేపాటి అమర్నాథ్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే మేడా మల్లికార్జున రెడ్డి, ఎంపీపీ మేడా విజయభాస్కర్ రెడ్డి, వైఎస్సార్ సీపీ కన్వీనర్ సిద్దవరం గోపిరెడ్డి, నల్లతిమ్మయ్యగారిపల్లి సర్పంచ్ గీతాల నరసింహారెడ్డి హాజరవుతారని తెలిపారు.

బండలాగుడు పోటీలు

ఉత్సవాల సందర్భంగా బండలాగుడు పోటీలు నిర్వహించనున్నారు. గెలుపొందిన ఎద్దుల యజమానులకు వారికి మొదటి బహుమతి ఎంపీ మేడా రఘునాథరెడ్డి చేతుల మీదుగా రూ. 30 వేలు నగదు అందజేయనున్నారు. ద్వితీయ బహుమతిని సిద్దవరం గోపిరెడ్డి రూ. 20 వేలు, తృతీయ బహుమతిని వీరపురెడ్డి హర్షవర్దన్ రెడ్డి రూ. 10 వేలు బహుమతిని అందజేయనున్నట్లు ఆలయ ధర్మకర్త గంగి నాయుడు తెలిపారు.

ఎల్ఐసీలో నూతన నియామకాలు చేపట్టాలి



రాయచోటి అర్బన్‌: సమ్మెలో పాల్గొన్న ఎల్ఐసీ ఉద్యోగులు



రాజంపేట టౌన్‌లో..

రాయచోటి అర్బన్ : ఎల్ఐసీలో నూతన నియామకాలను చేపట్టాలని ఎల్ఐసీ ఉద్యోగుల సంఘం రాయచోటి డివిజన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.విశ్వనాథ, డి.ఆదినారాయణరెడ్డి డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలోని డివిజనల్ కార్యాలయం ఎదుట మధ్యాహ్నం 12.30 నుంచి 1.30 గంటల వరకు ఉద్యోగులు సమ్మెలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇన్సూ రంగం రూపురేఖలు మారిపోతున్న తరుణంలో పరిజ్ఞానం ఉన్న యువతను నూతన ఉద్యోగులుగా నియమించుకోవాల్సిన అవసరం ఉందని చెప్పారు. యూపీఎస్సీ తరహాలో ప్రతి ఏటా ఎల్ఐసీలో అవసరమైన మేర నియామకాలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో ఎల్ఐసీ యూనియన్ నేతలు, సభ్యులు పాల్గొన్నారు.

సమ్మెకు పలువురి మద్దతు

ఎల్ఐసీ ఉద్యోగుల సమ్మెకు పలువురు మద్దతు తెలిపారు. క్లాస్-1 ఉద్యోగుల సంఘం నేతలు వేణుగోపాల్‌రెడ్డి, సుధాకరరెడ్డి హసన్‌బాషా, యూఈఈయూ జిల్లా కార్యదర్శి ఎ.వి.రమణ, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నేతలు బి.వి.రమణ, సీఐటీయూ జిల్లా కార్యదర్శి రామాంజులు సంఘీభావం ప్రకటించారు.

రాజంపేట టౌన్ : దేశంలో ఉన్న 80 శాతం ఎల్ఐసీ సిబ్బందికి ప్రాతినిధ్యం వహిస్తున్న ఆల్ ఇండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయిస్ అసోసియేషన్ (ఏఐఐఈఏ)కి గుర్తింపు పొందిన సంఘంగా హోదాను పునరుద్దరించాలని ఎల్ఐసీ ఉద్యోగుల సంఘం రాజంపేట బ్రాంచ్ కార్యదర్శి జి.రామకృష్ణారెడ్డి, అధ్యక్షుడు సుభాష్‌చంద్ర డిమాండ్ చేశారు. ఎల్ఐసీ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం గురువారం స్థానిక ఎల్ఐసీ కార్యాలయం ఎదుట ఉద్యోగులు నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా రామకృష్ణారెడ్డి, సుభాష్‌చంద్ర మాట్లాడుతూ ఇన్సూరెన్స్ రంగం రూపురేఖలు మారిపోతున్న తరుణంలో నూతన పాలసీదారుల ఆకాంక్షల మేరకు పనిచేయాలంటే సాంకేతిక పరిజ్ఞానం కలిగివుండే ఉన్నత విద్యావంతులతో ఖాళీలను భర్తీ చేయాలన్నారు. కేంద్ర ఆర్థిక మంత్రిత్వశాఖ, ఎల్ఐసీ యాజమాన్యం ఏకపక్ష దోరణులకు స్వస్తిపలికి ప్రజాస్వామికంగా వ్యవహరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు గంగాధర్, రాఘవేంద్ర, రాంప్రసాద్, చంద్రమోహన్‌రెడ్డి, రామచంద్రరావు, మహబూబ్‌బాషా, రాజశేఖర్‌రెడ్డి, జీవీ.సుబ్బయ్య, ఖాదర్‌బాషా, విజయమోహన్‌రెడ్డి, లక్ష్మీనారాయణ, భాస్కర్, నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

అవార్డు ప్రదానం

రాయచోటి అర్బన్ : లయన్స్‌క్లబ్ ఆఫ్ రాయచోటి టౌన్ వ్యవస్థాపక అధ్యక్షుడు పి.యస్. హరినాథరెడ్డికి సేవా యజ్ఞం అవార్డు దక్కింది. విజయవాడలోని మల్టిపుల్ కన్వెన్షన్‌లో గురువారం జరిగిన కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ ఇంటర్నేషనల్ థర్డ్‌వైస్ ప్రెసిడెంట్ విజయకుమార్ రాజు, మల్టీపుల్ కన్వెన్షన్ చైర్మన్ శ్రీకాంతి, ఇంటర్నేషనల్ డైరెక్టర్స్ శంకర్, మురుగన్‌లతో లయన్ జిల్లా గవర్నర్ గౌతమ్ చేతుల మీదుగా ఆయన అవార్డును అందుకున్నారు.

గుండాలకోనకు ఆర్టీసీ బస్సు ట్రయల్ రన్



గుండాలకోనకు వెళ్తున్న బస్సు

చిట్వేలి : మండలంలో పుణ్యక్షేత్రమైన గుండాల కోన కర్కటేశ్వరుడు సన్నిధికి ఇటీవల రహదారి పనులు పూర్తికావడంతో గురువారం ఆర్టీసీ అధికారులు గుండాలకోనకు ఆర్టీసీ బస్సుతో ట్రయల్ రన్ నిర్వహించారు. ట్రయల్ రన్ విజయవంతం కావడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఈ మార్గానికి చాలా కాలంగా సరైన రవాణా సదుపాయం లేకపోవడంతో కాలినడకన, ట్రాక్టర్లలో కర్కటేశ్వరుడు సన్నిధికి భక్తులు వెళ్లి మొక్కులు తీర్చుకునేవారు. ఈ సందర్భంగా గుండాలకోన చైర్మన్ బుంగటావుల రాజశేఖర్ మాట్లాడుతూ శివరాత్రికి గుండాలకోనలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. మహాశివరాత్రికి పెద్దూరు నుంచి గుండాలకోనకు బస్సు సౌకర్యం ఏర్పాటు చేయనున్నట్లు ఆయన తెలిపారు.

గ్రామ కంఠాన్ని అక్రమంగా ఆన్‌లైన్ చేశారు

నందలూరు : 40 సంవత్సరాలుగా ఆ స్థలంలో ఇళ్లు నిర్మించుకొని జీవిస్తున్నామని, నేడు కొంతమంది వచ్చి ఆ స్థలం తమదని, తమ పేరుతో రిజిస్టర్ అయ్యిందని, ఖాళీ చేయాలని బెదిస్తున్నారని కుంపిణీపురం గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కుంపిణీపురం గ్రామస్తులు గురువారం మాట్లాడుతూ మండలంలోని నూకినేనిపల్లి గ్రామ పంచాయతీ సర్వే నంబరు. 66/13లో ఒక ఎకరా, 60 సెంట్లు గ్రామ కంఠం స్థలం ఉందని, అందులో దాదాపు 20 ఇండ్లతో పాటు కొన్ని పాడుబడిన ఇండ్లు, ప్రభుత్వ రోడ్డు, చేతిబోరు ఉందని తెలిపారు. ప్రభుత్వం రికార్డుల్లో గ్రామ కంఠంగా ఉన్న స్థలాన్ని కొంతమంది వ్యక్తులు తప్పుడు రికార్డులను సృష్టించి, రెవెన్యూ రికార్డుల్లో ఆన్‌లైన్ చేసుకున్నారని పేర్కొన్నారు. గత ఏడాది డిసెంబర్ నెలలో ఆ స్థలాన్ని రిజిస్టర్ చేసుకున్నారని, ప్రస్తుతం వారు దౌర్జన్యంగా తాము నివసిస్తున్న స్థలాలలో జేసీబీలు పెట్టి చదును చేస్తూ తమను ఖాళీ చేయమని బెదిరిస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు తమకు న్యాయం చేయాలని కోరారు.

చెత్త నుంచి సంపద కేంద్రాల పరిశీలన

పుల్లంపేట : మండల పరిధిలోని రంగంపల్లి, టి కమ్మపల్లి, అనంతంపల్లి గ్రామ పంచాయతీలలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను ఏఓ శ్రీధర్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను వినియోగంలోకి తీసుకురావాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. గ్రీన్ అంబాసిడర్‌లు ప్రతి ఇంటి నుంచి తడి చెత్త, పొడిచెత్త రూపంలో సేకరించి సంపద తయారీ కేంద్రానికి తరలించి వర్మీ కంపోస్ట్ ఎరువును తయారీ చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమలో విస్తరణ అధికారి ముత్తయ్య, పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్, వేమయ్య, రామసుబ్బయ్య పాల్గొన్నారు.

ప్రతి రైతుకు యూనిక్ ఐడీ



ఐడీ నమోదు కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్

రాయచోటి టౌన్ : ప్రతి రైతుకు యూనిక్ ఐడీ తప్పనిసరి అని, ఇకపై యూనిక్ ఐడీతో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా లభించే పథకాలు, రాయితీలు వర్తిస్తాయని జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ అన్నారు. గురువారం రాయచోటి రూరల్ పరిధిలోని దిగువ అబ్బవరం గ్రామం రైతు సేవా కేంద్రాన్ని జిల్లా వ్యవసాయశాఖ అధికారి చంద్ర నాయక్‌తో కలసి తనిఖీ చేశారు. అనంతరం రైతులతో కలసి మాట్లాడుతూ వ్యవసాయ రంగాన్ని ఆధునీకరించే క్రమంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు 14 అంకెల ప్రత్యేక విశిష్ట గుర్తింపు సంఖ్య (యూనిక్ ఐడీ) కార్డును మంజూరు చేస్తున్నారన్నారు. ఫార్మర్ రిజిస్ట్రీ ద్వారా ప్రతి రైతుకు ఈ కార్డును అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్డు ద్వారా ప్రభుత్వం ద్వారా మద్దతు ధర, విత్తనాలు సరఫరా, రాయితీ ఎరువులు, విత్తనాలు వంటివి అందజేయడం జరుగుతుందన్నారు. దీని కోసం రైతులు పట్టాదారు పాస్ పుస్తకం, ఆధార్ కార్డు, ఆధార్ లింక్ ఉన్న ఫోన్‌ను తీసుకొని రైతు సేవా కేంద్రాలకు వెళ్లి నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రాయచోటి వ్యవసాయశాఖ అధికారులు పాల్గొన్నారు.

పి-4 సర్వేకు సహకరించాలి

పెనగలూరు : మండలంలో చేపట్టిన పి-4 సర్వేను ప్రతిఒక్కరూ చేయించుకోవాలని ఎంపీడీఓ విజయారావు తెలిపారు. పేదలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు మౌలిక సదుపాయాలు కల్పించేందుకు సర్వే దోహదపడుతుందన్నారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాలు అన్నీ యథావిధిగా ప్రతి ఒక్కరికీ అందుతాయన్నారు. ప్రజలు అపోహలకు గురికాకుండా సచివాలయం సిబ్బంది ఇంటివద్దకు రాగానే పూర్తి సమాచారాన్ని ఇవ్వాలని కోరారు. మండలంలో ప్రతి ఒక్కరూ సర్వేలో పాల్గొని సహకరించాలని కోరారు.

వైఎస్సార్‌సీపీలో పలు నియామకాలు

రాజంపేట : వైఎస్సార్‌సీపీ అనుబంధ సంఘాల జిల్లా అధ్యక్షుల నియామకం జరిగింది. పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు నియమించారు. పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ఉత్తర్వులు విడుదల చేశారు. రైతు విభాగం అధ్యక్షుడిగా యర్రపురెడ్డి ఆరంరెడ్డి, పంచాయతీరాజ్ వింగ్ అధ్యక్షుడిగా నాగా చంద్రశేఖర్‌రెడ్డి, పబ్లిసిటి వింగ్ అధ్యక్షుడిగా గీతాల నరసింహారెడ్డి, గ్రీవెన్స్‌సెల్ అధ్యక్షుడిగా శ్రీనివాసరాజులు, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధానకార్యదర్శిగా తాడిగట్ల అమరనాథ్‌రెడ్డి నియమితులైయ్యారు.

నియోజకవర్గాల అధ్యక్షులు వీరే..

యూత్‌వింగ్‌కు కూండ్ల ఓబుల్‌రెడ్డి, మహిళ విభాగంకు మిరియాల సురేఖ, రైతు విభాగం కేవీ సుబ్బయ్య, బీసీసెల్‌కు వడ్డె రమణ, ఎస్సీసెల్ దాసరి పెంచలయ్య, ఎస్టీసెల్‌కు రానా వెంకటేశ్వర్లు, మైనార్టీ సెల్‌కు పఠాన్ ఖాజామోహిద్దీన్, క్రిస్టియన్ మైనార్టీసెల్ పల్లపు సులమాన్, స్టడీ వింగ్‌కు పఠాన్ అబ్దుల్‌ఖాన్, పంచాయతీ వింగ్‌కు డీపీజీ లక్ష్మీనారాయణరెడ్డి, మున్సిపాలిటి వింగ్‌కు పిండిబోయిన రామ్మోహన్, ఆర్‌టీఐ వింగ్‌కు గంగరాజు వెంకటసుబ్బరాజు, వాలంటరీ వింగ్‌కు బయనబోయిన భాస్కరరాజు, గ్రీవెన్స్‌సెల్ వింగ్‌కు మన్నెం సంతోష్ రెడ్డి, వాణిజ్యవిభాగంకు మలిశెట్టి శ్రీను, వీవర్స్ వింగ్‌కు బొడ్డిచెర్ల శివయ్య, వైఎస్సార్‌ఆర్టీసీ వింగ్‌కు బత్తల భక్తుడు, అంగన్‌వాడీవింగ్‌కు సీ.రేణుకదేవి, లీగల్‌సెల్‌కు పాటూరు భరత్‌కుమార్‌రెడ్డి, కల్చరల్ వింగ్‌కు గడికోట వెంకటసుబ్బారెడ్డి, సోషల్‌మీడియా వింగ్‌కు రామజయచంద్ర, ఐటీ వింగ్‌కు యర్రపురెడ్డి పురుషోత్తంరెడ్డి, దివ్యాంగ వింగ్‌కు వీర అమరప్రకాశ్, ఇంటలెక్చువల్ ఫోరంకు బూసిరెడ్డి రాజశేఖరరెడ్డి, బూత్‌కమిటీల వింగ్‌కు వి.అమర్నాథ్, పబ్లిసిటి వింగ్‌కు మాదిరెడ్డి సత్యనారాయణ రెడ్డిని నియమించారు.

మండల అధ్యక్షులు వీరే..

రాజంపేట పట్టణ అధ్యక్షుడిగా జెనుగు వెంకటకృష్ణ యాదవ్, రాజంపేట మండల అధ్యక్షుడిగా దొడ్డిపల్లె భాస్కరరాజు, సిద్ధవటం మండలానికి సింగం నీలకంఠనాథరెడ్డి, ఒంటిమిట్టకు టక్కోలు శివారెడ్డి, నందలూరుకు సిద్ధవరం గోపిరెడ్డి, వీరబల్లికి సోమలరాజు జగదీశ్వరరాజు(మణిరాజు). టీ.సుండుపల్లెకు ముప్పిరెడ్డి రామస్వామిరెడ్డి అధ్యక్షులుగా నియమితులైయ్యారు.

వైఎస్ జగన్ ప్రజాదరణ చూసి ఓర్వలేకపోతున్నారు

రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆకేపాటి అమర్నాథ్ రెడ్డి

ఒంటిమిట్ట : కృష్ణ, గుంటూరు పర్యటనలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ కోసం వచ్చిన అశేష జనాన్ని చూసి టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఓర్వలేకపోతున్నారని వైఎస్సార్‌సీపీ అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు, రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్నాథ్ రెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రమైన ఒంటిమిట్టలో ఆయన కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు రైతులను గాలికొదిలేస్తే రైతును దళారులు దోచుకుంటున్నారని, దీంతో రైతులపక్షాన వైఎస్ జగన్ గళం విప్పారన్నారు. చంద్రబాబు ప్రభుత్వం కావాలనే ప్రతిపక్ష నాయకుడి భద్రత విషయంలో నిర్లక్ష్యం వహించిందన్నారు. అనంతరం మండల కేంద్రమైన టీటీడీ కల్యాణ వేదికలో భాకరాపేట వైఎస్సార్‌సీపీ నాయకుడు కేవీ కుమార్‌రెడ్డి వివాహ వేడుకకు హాజరై వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల శాఖ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ ఆకేపాటి వేణుగోపాల్ రెడ్డి, మండల నాయకులు, కార్యకర్తలుపాల్గొన్నారు.

కౌలు రైతులకు పంట రుణాలివ్వాలి



లీడ్‌బ్యాంకు మేనేజర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కౌలురైతుల సంఘం నేతలు

రాయచోటి అర్బన్ : జిల్లా పరిధిలోని కౌలు రైతులందరికీ వెంటనే పంట రుణాలు మంజూరు చేయాలని ఏపీ కౌలురైతుల సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వంగిమళ్ళ రంగారెడ్డి డిమాండ్ చేశారు. గురువారం ఆయన రైతుసంఘం నేతలతో కలసి స్టేట్ లీడ్‌బ్యాంక్ మేనేజర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని కౌలురైతులు పంట సాగుకు అప్పులు చేస్తున్నారన్నారు. ఏపీ పంటదారుల హక్కుచట్టం ప్రకారం కౌలు రైతులకు విరివిగా రుణాలు మంజూరు చేసి ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో కౌలురైతుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు హరినాథనాయుడు, బాలకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యతోనే పేదరికం లేని సమాజం



డైనింగ్ హాల్‌ను ప్రారంభిస్తున్న ఎంపీడీఓ, ఎంఈఓ

రాజంపేట టౌన్ : విద్యతోనే పేదరికం లేని సమాజం సాధ్యమవుతుందని ఎంపీడీఓ పగడాల వరప్రసాద్, ఎంఈఓ కొండూరు రఘునాథరాజు తెలిపారు. మండలంలోని ఎన్‌టీఆర్ కాలనీ ప్రాథమిక పాఠశాలలో విద్యానగర్‌కు చెందిన కావటూరి ఆదినారాయణ రూ.2 లక్షల తన సొంత డబ్బులతో విద్యార్థుల సౌకర్యార్థం భోజనశాల (డైనింగ్ హాల్)ను నిర్మించారు. ఈడైనింగ్ హాల్‌ను గురువారం ఎంపీడీఓ, ఎంఈఓ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించినప్పుడే సమాజంలో ఆర్థిక అసమానతలు తొలగిపోతాయని తెలిపారు. విద్యార్థులు బాగా చదవి తల్లిదండ్రుల ఆకాంక్షలను నెరవేర్చాలని సూచించారు. కావటూరి ఆదినారాయణ మాట్లాడుతూ ఎన్‌టీఆర్ కాలనీలోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు సహాయం చేసే అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం మల్లు నరసారెడ్డి, ఉపాధ్యాయులు నాయుడోరి శ్రీనివాసులు, రాజేష్, భాగ్యలక్ష్మి, చంద్ర పాల్గొన్నారు.